# సాక్షి అనకాపల్లి

సోమవారం । 16 । అక్టోబర్ । 2023







**వైఎస్సార్‌సీపీకే ఓటడిగే అర్హత..**

ఇంటింటా సంక్షేమం అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే ఓటడిగే అర్హత ఉందని డిప్యూటీ సీఎం బూడి అన్నారు. 10లో



**రంగ స్థలంపై దసరా సందడి**

దసరా నవరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లిలో నాటికోత్సవ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 10లో



**పలు రైళ్ల గమ్యం కుదింపు**

కేకే లైన్‌లో పునరుద్ధరణ పనులు ముగిసినా పలు రైళ్లకు ఇంకా అనుమతులు ఇవ్వలేదు. 10లో

# ఐటీ డెస్టినీ విశాఖ

- బీచ్ ఐటీ డెస్టినేషన్ కాన్సెప్ట్‌తో సరికొత్తగా ముందుకు..
- బీజం వేసిన దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- అదే బాటలో విప్రో 1000 మందితో విస్తరణకు ప్రణాళికలు

**దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో కీలకమైన విశాఖ ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా మారుతోంది. ఏపీ ప్రభుత్వం బీచ్ ఐటీ డెస్టినీ కాన్సెప్ట్‌తో చేసిన ప్రమోషన్‌కు ఆకర్షితులైన పలు సంస్థలు తమ శాఖలను విశాఖలో విస్తరింపజేస్తున్నాయి. తాజాగా ఈ వరుసలో దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ చేరింది. 1000 మందితో డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభించి క్రమంగా విస్తరించే దిశగా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. మిగిలిన దిగ్గజ సంస్థలు సైతం విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఇక్కడే ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్న నేపథ్యంలో ఐటీ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోంది.**

**సాక్షి, విశాఖపట్నం:** భారత్‌ని నడిపించే చోదక శక్తులుగా మారుతున్న టైర్–2 నగరాల్లో ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు.. తమ శాఖల్ని విస్తరించుకుంటున్నాయి. మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతూ.. సకల సౌకర్యాలతో పరిఢవిల్లుతున్న టైర్–2 నగరాల్లో మిన్నగా ఉన్న విశాఖను మొదటి ఆప్షన్‌గా ఎంపిక చేసుకుంటూ తమ సంస్థ కార్యాలయాల్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. అద్భుతమైన ఐటీ పాలసీని ప్రవేశపెడుతూ.. మరోవైపు.. ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా త్వరలోనే అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నంలో అపారమైన అవకాశాలున్నాయని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రభుత్వం బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ని ప్రమోట్ చేసింది. అందుకే అంతర్జాతీయంగా పేరొందిన ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు విశాఖకు తరలివస్తున్నాయి. టెక్ మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్‌ఎస్ మొదలైన ఐటీ, ఐటీ అనుబంధ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. తాజాగా ఇన్ఫోసిస్ సంస్థ తన డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలను మొదలుపెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఇన్ఫోసిస్‌ని ప్రారంభించనున్నారు. తొలి దశలో 1000 మందితో కార్యకలాపాలు ప్రారంభించి దశలవారీగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**అడుగులు వేస్తున్న మరిన్ని సంస్థలు**

ఇన్ఫోసిస్ మాదిరిగా విశాఖలో తమ కార్యకలాపాలు విస్తరించేందుకు అనేక ఐటీ సంస్థలు ముందుకు వస్తున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2006లో విప్రో క్యాంపస్‌కు స్థలాన్ని కేటాయించారు. 750 మందితో ప్రారంభించాలని భావించినా.. చంద్రబాబు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో 300 మందితో ప్రస్థానం మొదలు పెట్టింది. ఇప్పుడు కార్యకలాపాల జోరు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విప్రో ప్రతినిధులతో చర్చించింది. దశల వారీగా 1000 మందికి విస్తరించేందుకు సిద్ధమని ప్రకటించింది. వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ని మార్చాలని నిర్ణయించింది. విశాఖలో స్టార్టప్‌ల ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్) సీఈవో సంజీవ్ మల్హోత్రా ప్రకటించారు. అదేవిధంగా ఐటీ రంగంలో తిరుగులేని నగరంగా విశాఖను అభివృద్ధి చేసేందుకు ఇక్కడే ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఐటీ పరిశోధనలు, అభివృద్ధిలో భాగంగా.. ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంబ్రిడ్జిలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) సహకారంతో పాటు సంయుక్త సర్టిఫికేషన్ కోర్సుల్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఇందుకోసం ఐఏఎస్ అధికారులతో కూడిన ప్యానెల్‌ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్

**మహానేత వై.ఎస్ హయాంలోనే..**

మహానేత డాక్టర్ వై.ఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే విశాఖలో ఐటీకి అడుగులు పడ్డాయి. మధురవాడలోని మూడు కొండల మధ్య 300 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సెజ్‌లో తొలిదశలో ఇన్ఫోటెక్, సింబయాసిస్, మిరాకిల్, కెనెక్సా వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు సహా మొత్తం 26 సంస్థలు తరలివచ్చాయి. క్రమంగా సంస్థలు పెరిగాయి. అయితే.. రూ.1800 కోట్లకు చేరుకున్న ఎగుమతులు ఆయన మరణానంతరం చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక.. రూ.1400 కోట్లకు పడిపోయాయి. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విశాఖలో ఐటీ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ దృష్టిసారించారు. గత ప్రభుత్వ హయాంలో బకాయి పడ్డ రూ.వందకోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేశారు. అద్భుతమైన ఐటీ పాలసీని రూపొందించిన ప్రభుత్వం దిగ్గజ సంస్థల్ని ఆకర్షిస్తోంది.

## నేడు సీఎం పర్యటన ఇలా..



**సాక్షి, విశాఖపట్నం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నెం.3 వద్దకు వస్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన ఐటీ హిల్ నెం.2కు చేరుకొని ఇన్ఫోసిస్ కార్యకలాపాల్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ఇన్ఫోసిస్, వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి కాసేపు సంభాషించనున్నారు. అనంతరం 11.55 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకొని అక్కడ జీవీఎంసీ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ మిషన్ ప్రారంభిస్తారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 12.15 గంటలకు పరవాడ చేరుకొని ఫార్మా సిటీలో గల యుజియా స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అచ్యుతాపురం సెజ్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకొని.. అక్కడ మధ్యాహ్నం 1.30 నుంచి 1.45 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి లారస్ ల్యాబ్‌కు చేరుకొని యూనిట్–2ను ప్రారంభిస్తారు. పరిశ్రమను సందర్శించి, కంపెనీ సీఈఓ, డైరెక్టర్లు, ఉద్యోగులతో ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 3.10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడ నుంచి 3.20 గంటలకు తిరుగు పయనమవుతారు.

## విశాఖలో అపారమైన అవకాశాలు



ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా త్వరలోనే అభివృద్ధి చెందేందుకు విశాఖలో అపారమైన అవకాశాలున్నాయి. ఐటీ పరిశ్రమలన్నీ తమ తదుపరి డెస్టినేషన్‌గా ద్వితీయ శ్రేణి నగరాల్ని ఎంపిక చేసుకుంటున్నాయి. ఐటీ సర్వీస్ సెక్టార్ పరిశ్రమల ఏర్పాటుకు వైజాగ్ వంటి నగరాలే మొదటి ప్రాధాన్యం. ఐటీ సంస్థలకు కావల్సిన మానవ వనరుల్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎమర్జింగ్ టెక్నాలజీ, కోర్ ఐటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులపై సంస్థలు దృష్టి సారిస్తూ విశాఖలో కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.

–కిరణ్‌రెడ్డి, ఎపిటా గ్రూప్ సీఈవో

# నేడు పలు ఫార్మా కంపెనీలకు ప్రారంభోత్సవం

**యుజియా ఫార్మా, లారస్ ల్యాబ్ యూనిట్–2 ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

**సాక్షి, అనకాపల్లి:** పరవాడ రాంకీ ఫార్మాసిటీలో గల అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యుజియా (ఈయూఐజీఐఎ) స్టెరిలీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను, అచ్యుతాపురం సెజ్‌లోని లారస్ ల్యాబ్‌లో నూతన యూనిట్‌లను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. పర్యటనకు సంబంధించిన కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించడంతో పాటు పరవాడ, అచ్యుతాపురంలో పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ముందుగా విశాఖలో రుషికొండ ఐటీ సెజ్ లో హిల్ నెంబర్–2లో ఇన్ఫోసిస్‌లో ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సీఎం లాంఛనంగా ప్రారంభించి అక్కడే ఇన్ఫోసిస్, వివిధ కంపెనీల ఐటీ ప్రతినిధులతో కాసేపు సంభాషించనున్నారు. అనంతరం హెలీకాప్టర్‌లో అనకాపల్లి జిల్లా పరవాడకు చేరుకుని రాంకీ ఫార్మాసిటీలో గల అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యుజియా(ఈయూఐజీఐఎ) స్టెరిలీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో నూతన యూనిట్‌ను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి అచ్యుతాపురం సెజ్‌కు చేరుకుని అక్కడ లారస్ ఫార్మా ల్యాబ్‌లో యూనిట్–2 ఫార్ములేషన్ బ్లాక్, ఎల్ఎస్పీఎల్ యూనిట్–2ని ప్రారంభించనున్నారు.




రాంకీ ఫార్మాసిటీలోని యుజియా పరిశ్రమ

## పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు



భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, ఎస్పీ మురళీకృష్ణ

**సాక్షి, అనకాపల్లి:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు పటిష్టమైన పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. ఆదివారం కాన్వాయ్ ట్రయల్ రన్‌ను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ కలిసి నిర్వహించారు. పరవాడ పరిశ్రమ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను, అచ్యుతాపురం, ఏపీఎస్ఈజెడ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పోలీసు అధికారులు పర్యవేక్షించారు. కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఏఎస్పీ బి.విజయభాస్కర్, నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తానా పురస్కార గ్రహీతకు సత్కారం



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

**తుమ్మపాల:** తానా కావ్య రచన ప్రపంచ పోటీలలో మన ప్రాంతవాసి బులుసు వెంకటేశ్వర్లు రూ.లక్ష బహుమతి పొందడం అభినందనీయమని ఎంపీ బి.వి. సత్యవతి అన్నారు. పట్టణంలో శ్రీ వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వేదికగా ఆదివారం ఆంధ్రపద్య కవితా సదస్సు ఆధ్వర్యంలో జరిపిన అభినందన సభలో ఆమె పాల్గొని వెంకటేశ్వర్లును సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు పద్యం, కావ్యం గొప్పతనాన్ని ప్రపంచ సభల్లో ప్రస్తావించడం, 130 కి పైగా కావ్యాలు వస్తే వాటిలో బులుసు వెంకటేశ్వర్లు కావ్యం ప్రాముఖ్యాన్ని సంతరించుకోవడం మన ప్రాంత గొప్పతనాన్ని చాటిచెప్పడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర పద్య కవితా సదస్సు జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ విష్ణుమూర్తి, ముద్రు ముత్యాలనాయుడు, కె.కోటారావు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

# భూమికి పచ్చని రంగేసినట్టు..!



యలమంచిలి–గాజువాక బైపాస్ రహదారి పక్కన భూమికి పచ్చని రంగేసినట్టు కనిపిస్తున్న వరి పొలాలు

- ఖరీఫ్‌లో కళకళలాడుతున్న వరి పంట
- జిల్లాలో 1.42 లక్షల ఎకరాల్లో సాగు

**అనకాపల్లి రూరల్:** జిల్లాలో సాగు నీరందించే చెరువులు, కాల్వలు, శారద, వరాహనదీ తీర గ్రామాలు, ప్రాంతాలతోపాటు, బోర్ల సదుపాయం ఉన్నచోట్ల సాగు చేస్తున్న పొలాలు వరి పంటతో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోయినా, అందుబాటులో ఉన్న నీటి లభ్యతతోనే రైతులు పంటలను సాగు చేశారు. జిల్లాలో 1.42 లక్షల ఎకరాల్లో వరి పంటను అన్నదాతలు సాగు చేస్తున్నారు. వరి నాట్లు పూర్తవడంతో ఎక్కడ చూసినా పచ్చని వాతావరణం కనిపిస్తోంది. యలమంచిలి పట్టణానికి సమీపంలో ఉన్న పెంజెరువు ఆయకట్టు భూములు, యలమంచిలి–గాజువాక బైపాస్ రోడ్డు పక్కన,అనకాపల్లి మండలం తుమ్మపాల,మార్టూరు ప్రాంతాల్లో, రాంబిల్లి మండలం దిమిలి, తెరువుపల్లి, మామిడివాడ గ్రామాల వద్ద ఒకే చోట వేలాది ఎకరాల్లో వరి పొలాలు వరి పంటతో ఆకుపచ్చగా మెరుస్తున్నాయి. పుడమి పచ్చరంగు పులుముకుని పరవశంతో గెంతులేస్తున్నట్టు ప్రధాన రహదారుల వెంబడి వరి పంట కళకళలాడుతూ చూపరులను ఆకట్టుకుంటోంది. పలువురు ఈ పొలాల వద్ద ఫొటోలు, వీడియోలను తీసుకుని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసుకుంటున్నారు.

## • కొలువుదీరిన దుర్గమ్మ



స్వర్ణకవచాలంకరణలో అనకాపల్లిలోని సతకంపట్టు కనకదుర్గ అమ్మవారు



యలమంచిలి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో ఆకట్టుకుంటున్న అమ్మవారి ఉత్సవ విగ్రహం ఇది. జిల్లాలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా అమ్మవారి విగ్రహాలను సందడిగా ఊరేగించి మండపాల్లో కొలువుంచారు.

## క్లుప్తంగా

### శ్రీప్రకాష్‌లో క్లస్టర్ -7 ఖోఖో పోటీలు ప్రారంభం



జట్టు సభ్యులను పరిచయం చేసుకుంటున్న సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్

పాయకరావుపేట: విద్యార్థులకు క్రీడలు మానసిక, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల నందు నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్ -7 ఖోఖో పోటీలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పాల్గొన్న సుమారు 1200 మంది క్రీడాకారులతో ఘనంగా ప్రారంభమైనవి. ఈ పోటీలు బాలుర, బాలికల విభాగంలో అండర్ -19 కేటగిరీలో మూడు రోజుల పాటు జరుగనున్నాయని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. 17వ తేదీన గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. ప్రారంభ మ్యాచ్ బాలికల విభాగంలో లక్ష్య స్కూల్, సామర్లకోట మరియు ఫోర్ట్ సిటీ స్కూల్ విజయనగరం మధ్య జరిగింది. ఈ పోటీలో ఫోర్ట్ సిటీ స్కూల్ విజయనగరం విజయం సాధించింది.

### కొవ్వూరులో నాటుకోళ్ల చోరీ

వారం వ్యవధిలోనే రెండో ఘటన



చోరీకి గురైన కోళ్లు(ఫైల్)

రోలుగుంట: మండలంలోని కొవ్వూరులో నాటుకోళ్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. దాంతో వాటి పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి సన్యాసమ్మ, చంద్రగిరి రాజు జీవనోపాధులకు ఏడాదిగా నాటుకోళ్లు పెంచుకుని, వాటి విక్రయాల ద్వారా కొంత ఆదాయం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న సన్యాసమ్మకు చెందిన రూ.50 వేల విలువ చేసే 15 కోళ్లు చోరీకి గురయ్యాయి. ఇదే వారంలో మూడు రోజుల తర్వాత శుక్రవారం రాజుకు చెందిన రూ.50 వేల విలువ చేసే 12 కోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. దీంతో వారికి ఆర్థికంగా నష్టం వాటిల్లడంతో బోరుమంటున్నారు. చోరీలను అరికట్టి ఆదుకోవాలని గ్రామానికి చెందిన కోళ్ల పెంపకందారులు కోరుతున్నారు.

# వైఎస్సార్‌సీపీకే ఓటడిగే అర్హత

- సంక్షేమ, అభివృద్ధి పనులే పార్టీకి శ్రీరామరక్ష
- వివక్ష లేకుండా ప్రతీ ఇంటికి చేసిన మేలును వివరించాలి
- గత ప్రభుత్వంలో చేసిన తప్పులతోనే చంద్రబాబు జైలు పాలు
- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే సమావేశంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి, పార్టీ నాయకులు

కె.కోటపాడు: రాష్ట్రంలో వివక్ష లేకుండా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించి మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ఓటు అడిగే అర్హత ఉందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కె.కోటపాడులో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్, ఎంపీటీసీ, పార్టీ నాయకులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దిశానిర్దేశం చేశారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు, ఆ పార్టీ నాయకులు మామూళ్లు దండుకుని అనర్హులకు సంక్షేమ పథకాలు అందజేశారని విమర్శించారు. సుదీర్ఘ పాదయాత్రలో జగనన్న అన్ని వర్గాల ఇబ్బందులను గుర్తించి అధికారంలోకి వచ్చిన తర్వాత వివక్ష, పైసా లంచం అన్న మాట లేకుండా సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. పార్టీ పిలుపు మేరకు ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ, అభివృద్ధిని వివరించాలని సూచించారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాలంటే రాష్ట్రానికి సీఎం జగన్ ఎంతో అవసరమని వివరించాలని సూచించారు. డిసెంబర్ నుంచి ఆడుదాం..ఆట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి సీఎంగా జగన్‌ను ఎన్నుకోవాలని కోరారు.

**చంద్రబాబు జైలుకెళ్తే ప్రభుత్వంపై విమర్శలా?**

2014–19 పాలన కాలంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన అవినీతి పనులే ప్రస్తుతం ఆయన్ను జైలు పాలు చేసినట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. 35 రోజులు గడుస్తున్నా, బెయిల్ రాలేదంటే ఆయన తప్పు చేశారని కోర్టులు నమ్ముతున్నాయన్నారు. చంద్రబాబు జైలుకు వెళ్తే తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీపై బురద జల్లుతున్నారని ఆగ్రహించారు. ఆయనకు అంటుకున్న అవినీతి మరకలు పోగొట్టడానికి తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తప్పు చేయకపోతే కోర్టులో నిరపరాధిగా నిరూపించుకుని బయటకు రావాలని సవాల్ విసరారు.

**మాడుగులలో వచ్చే నెల 2న బస్సు యాత్ర**

ఉత్తరాంధ్ర జిల్లాల్లో మంత్రుల సామాజిక బస్సు యాత్ర వచ్చే నెల 2న మాడుగులలో నిర్వహించనున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా మాడుగులలో ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, రాజన్నదొరతోపాటు పలువురు హాజరు కానున్నట్లు తెలిపారు. సీఎం జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు జరిగిన మేలును బస్సు యాత్ర ద్వారా వివరిస్తామన్నారు. సమావేశంలో మాడుగుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, పార్టీ మహిళా, యువజన విభాగం మండల అధ్యక్షులు పైల అమ్మాజి, గొర్రుపోటు వెంకటరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ ఈర్లె గంగునాయుడు(నాని) పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

## కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే రైతు ఆత్మహత్యలు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

అనకాపల్లి రూరల్: ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్లే అన్నదాతల ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఏపీ రైతు సంఘం నాయకులు ఆరోపించారు. ఆదివారం సంఘం అనకాపల్లి జిల్లా మొదటి మహాసభ సందర్భంగా రైతు సంఘాల నేతల ఆధ్వర్యంలో పట్టణంలో సీపీఐ భవన్ నుంచి నెహ్రూచౌక్, రాజా టాకీస్, వేల్పుల వీధి మీదుగా రోటరీ కల్యాణ మండపం వరకు ప్రదర్శన నిర్వహించారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవీపీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందిచ్చిన హామీలను విస్మరించడం రైతులను మోసగించడమే అన్నారు. కార్పొరేట్లను ప్రోత్సహిస్తూ రైతులు, పేద వర్గాల వారిని మోదీ ప్రభుత్వం మోసగిస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో సంఘం తరపున చేసే ఉద్యమాలకు అందరూ మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, నూకినాయుడు, లక్ష్మి, మేకా సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు జగ్గారావు, రెడ్డిపల్లి అప్పలరాజు, డీసీహెచ్ రాజబాబు, వైఎస్ భద్రం, రాజాన దొరబాబు, గురుబాబు, వి. కాసుబాబు, కోరుబిల్లి శంకర్రావు పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్ఐ మెయిన్స్ పరీక్షలు

అల్లిపురం: ఏపీ పోలీస్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో నగరంలో పలు పరీక్ష కేంద్రాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏపీఎస్‌పీ) అభ్యర్థుల మెయిన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ పర్యవేక్షణలో, విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఆధ్వర్యంలో నగరంలో 19 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలో 11,069 మంది పరీక్షలకు హాజరవ్వగా, మధ్యాహ్నం 11,064 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను నగర శాంతి భద్రతల డీసీపీలు, క్రైం డీసీపీలు పర్యవేక్షించగా, అడ్మిన్ ఏడీసీపీ ఎం.ఆర్.కె.రాజు నోడల్ ఆఫీసర్‌గా తనిఖీలు నిర్వహించారు.

# రూ. 6 కోట్లతో ప్రత్యామ్నాయ రోడ్డు విస్తరణ

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- భవన యజమానుల అభీష్టం మేరకే పనులు



ప్రత్యామ్నాయ రోడ్డుకు కొలతలు వేయిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నర్సీపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు ఉన్న రోడ్డును రూ.6 కోట్లతో విస్తరిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. రోడ్డు విస్తరణ వల్ల నష్టపోతున్న భవన యజమానులతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సమావేశమై అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించారు. అధికారులచే రోడ్డు కొలతలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరిస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణంతో మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారన్నారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి సోమవారం టెండర్ నోటిఫికేషన్ ఇస్తామన్నారు. వచ్చే నెల 15వ తేదీన విస్తరణ చేపడతామన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును 40 అడుగులకు విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ వారంలో మరోసారి భవన యజమానులతో సమావేశమై వారి సూచనల మేరకు రోడ్డు విస్తరణ చేపడతామన్నారు. రోడ్డు విస్తరణకు అన్ని వర్గాల వారు సహకరించాలన్నారు.

**తొలగించని పక్షంలో మేమే తొలగిస్తాం..**

మెయిన్ రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకిగా మారిన స్వామి అయ్యప్ప ఆలయ ముఖద్వారం తొలగింపునకు సమయం కావాలని ఆలయ నిర్వాహకులు కోరినట్లు ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. సిద్ధాంతిని తీసుకొచ్చి తొలగిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారన్నారు. ఈ విషయంలో కాలయాపన చేస్తే హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా తామే సిద్ధాంతిని తీసుకొచ్చి ముఖద్వారాన్ని తొలగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, మాజీ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, బేతిరెడ్డి రత్నం, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, లగుడు స్వామి, కిల్లాడ లోవరాజు, ఎల్లేటి శ్రీనివాస్, మామిడి శ్రీను, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు లోకవరపు శారద, గంటా లలిత, దేవత అరుణ, పార్టీ నాయకులు చిటికెల కన్నబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు, డీఈ నారాయణరావు, ఏఈ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

## అపుస్మాకు జ్యూరీ చాంపియన్ షిప్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఖాసిమ్ తదితరులు

కె.కోటపాడు: నేషనల్ ఎడ్యుకేషన్ వరల్డ్ నిర్వహించిన ఇండియా స్కూల్స్ ర్యాంకింగ్స్ 2023–24కు రాష్ట్రానికి చెందిన అపుస్మా జ్యూరీ చాంపియన్ షిప్ అవార్డుకు ఎంపికైనట్లు అపుస్మా రాష్ట్ర ఐటీ విభాగం చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ తెలిపారు. ఈ అవార్డును ఢిల్లీలో శనివారం రాత్రి ఇండియన్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కులభూషణ్ శర్మ చేతుల మీదుగా అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి స్వీకరించినట్లు ఖాసిమ్ తెలిపారు. ఈ అవార్డుతో పాటు గ్రామీణ ప్రాంతంలోని కె.కోటపాడులో గల బడ్జెట్ స్కూల్ ర్యాంకింగ్‌లో అయ్యన్న స్కూల్ నామినేట్ అయినట్లు ఆయన తెలిపారు.

## పోలవరం ప్రాజెక్టుతో రైతాంగానికి మేలు



విలేకరులతో మాట్లాడుతున్న ఈర్లె శ్రీరామ్మూర్తి

అనకాపల్లిటౌన్: పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో రైతాంగానికి మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర మీడియా సెల్ ప్రతినిధి ఈర్లె శ్రీరామ్మూర్తి అన్నారు. స్థానిక చదువులవారివీధి పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి73 సంవత్సరాలు కావస్తున్నా ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని గెలించిస్తే సాగు, తాగునీటి ప్రాజెక్టులు నిర్మించి, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో 70 శాతం రైతాంగం ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు లేదన్నారు. ఉత్తరాంధ్రలో వంశధార, నాగావళి, తాటిపూడి, రైవాడ, పెద్దేరు జలాశయాల ద్వారా 1700 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని, 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మించినట్లయితే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 22 శాతం, పంజాబ్‌లో 35 శాతం పంటలు పండించేందుకు అవకాశం ఉంటే రాష్ట్రంలో 70 శాతం అవకాశం ఉందన్నారు. రైతు ఉద్యమాల ద్వారా ప్రాజెక్టులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. తప్పు చేసిన వారు చట్టానికి అతీతులు కాదని, చంద్రబాబునాయుడును అరెస్టు చేసే ముందు 41 నోటీసు ఇవ్వకపోవడం పొరపాటు అన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టు విషయంలో బీజేపీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి గొంతిన భిక్షసాయిరాం, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, జిల్లా నాయకులు పి.గంగయ్య, బొడ్డేడ నాగేశ్వరరావు, నర్సింగరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : ఇటీవల వాల్తేర్ డివిజన్, కొత్తవలస – కిరండూల్ (కేకే) లైన్, మనబార్ – జరాటి స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో పునరుద్ధరణ పనులు ముగిసినప్పటికీ ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లకు ఇంకా అనుమతులు ఇవ్వలేదు. ఈ కారణంగా పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లైన్‌లో ప్రస్తుతం గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

- భువనేశ్వర్‌లో ఈ నెల 15, 16న బయల్దేరే భువనేశ్వర్ – జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, 17న కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో ఈ నెల 15, 16న బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్‌గా ఈ నెల 16, 17న కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో ఈ నెల 16, 17న బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 16, 17న అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- హౌరాలో ఈ నెల 15, 16న బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, 17న టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.
- రూర్కెలాలో ఈ నెల 16న బయల్దేరే రూర్కెలా – జగదల్‌పూర్ (18107) ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – రూర్కెల (18108) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17న కోరాపుట్ నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది.

## సారా విక్రేత అరెస్ట్

మోపెడ్‌తోపాటు 10 లీటర్ల సారా స్వాధీనం

రావికమతం: పది లీటర్ల సారాతోపాటు నిందితుడిని అరెస్ట్ చేశామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలోని చినకుముందానిపేటలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. అక్కడ గ్రామానికి చెందిన గెంజి ఈశ్వరరావును అరెస్ట్ చేసి, అతడి నుంచి పది లీటర్ల సారాతోపాటు టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

## త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

మంత్రి అమర్‌నాథ్ హామీ



మంత్రి అమర్‌నాథ్‌తో మాట్లాడుతున్న విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార: జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖ అక్రిడిటేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (వీఏడబ్ల్యూజేహెచ్) గౌరవాధ్యక్షులు కేజీ రాఘవేంద్రారెడ్డి, జి.జనార్దన్‌రావు, అధ్యక్షుడు బి.రవికాంత్ ఆదివారం మంత్రి అమర్‌నాథ్‌ను ఆయన నివాసంలో కలిసి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ సొసైటీ ద్వారా రిజిస్టర్ అయిన అక్రిడిటేటెడ్ జర్నలిస్టుల వివరాలను ఆయనకు అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అతిత్వరలోనే జర్నలిస్టులు కచ్చితంగా శుభవార్త వింటారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో సానుకూలంగా ఉన్నారని, విశాఖలోని అక్రిడిటేటెడ్ జర్నలిస్టులకు న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఉపాధ్యక్షుడు కె.పరశురాం, సహాయ కార్యదర్శి ఎం.చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. రమేష్, సభ్యులు బి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# రంగ స్థలంపై దసరా సందడి

- ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవాలు ప్రారంభం
- 19వ తేదీ వరకూ నాటికల ప్రదర్శనలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్: గవరపాలెం సతకంపట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని గౌరీ సేవాసంఘం మళ్ల జగన్నాథం కల్యాణమండపంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నాటిక పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 19వ తేదీ వరకూ నాటికలు జరుగుతాయన్నారు.

**'జరుగుతున్న కథ'..**

గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద్ ఆర్ట్స్ వారి ప్రదర్శన. వృద్ధాప్యం అనివార్యం. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన పిల్లలు చదువుల పేరుతోనో, ఉద్యోగాల పేరుతోనే దూరంగా ఉంటున్నారు. తల్లిదండ్రుల 25,30 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో సంపాదించింది పిల్లలు తమ తమ అవసరాల కోసం వారివద్ద నుంచి తీసుకొని వారికి ఆర్థిక భరోసా లేకుండా చేస్తున్నారు. చిన్నచిన్న అవసరాలకు కూడా వృద్ధాప్యంలో పిల్లలపై ఆధారపడవలసిన స్థితి రావడడం ఎంతైనా గర్హనీయం. పిల్లలపై ప్రేమ ఉండాలి. అది ఎంతవరకు ఉండాలనే విచక్షణ కూడా ఉండాలి. లేకపోతే వృద్ధాప్యంలో మనుగడ కష్టమవుతుంది. వృద్ధులూ తస్మాత్ జాగ్రత్త...అనే అంశంపై జరుగుతున్న కథ నాటిక ప్రదర్శించారు. నాటిక రచన–ఆకెళ్ల, దర్శకత్వం గంగోత్రిసాయి, సంగీతం కె.సత్యనారాయణమూర్తి నిర్వహించారు.

**'ఖరీదైన జైళ్లు' నాటిక...**

తెలంగాణలోని, కరీంనగర్ జిల్లా, చైతన్య కళాభారతి వారి ప్రదర్శన ఇది. కథా సంగ్రహం...మనిషి అంటే కాళ్లు చేతులు, కళ్లు, నోరు, ఇలా అవయవాలు కాదు, అది జంతువులకు కూడా ఉంటాయి. జంతువుల నుంచి మనిషిని వేరు చేసేది మనసు మాత్రమే. అది దేవుడు మనిషికి మాత్రమే ఇచ్చాడు. మనిషిగా పుట్టి కూడా చాలా మంది ఇంకా అవయవాలతోనే బతికేస్తున్నారు. అనే ఇతివృత్తమే 'ఖరీదైన జైళ్లు' నాటిక సారాంశం. దీనికి నాటకీకరణ పి.శివరాం, దర్శకత్వం మంచాల రమేష్, సంగీతం సురభి నాగరాజు, మూలకథ పి.వెంకటేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మళ్ల సాంబశివరావు, ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, కమిటీ సభ్యులు కె.ఎం.నాయుడు, కొణతాల పూర్ణచంద్రరావు, మళ్ల సూరిబాబు, పి.వి.సత్యనారాయణ, శివాజీ పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు



మలుపు తిరుగుతున్న కారు పక్క భాగం దెబ్బతిన్న దృశ్యం



ఢీ కొట్టిన కారు ముందు భాగం నుజ్జయిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: మలుపు తిరుగుతున్న కారును వేగంగా వస్తున్న మరో కారు ఢీకొట్టిన ఘటన విశాఖ డెయిరీ పార్లర్ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. గాజువాక పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టౌన్ నుంచి వస్తున్న కారు నాతయ్యపాలెం వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతోంది.. ఈ కారులో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉన్నారు. ఇదే సమయంలో పరవాడ నుంచి సింహాచలం వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ కారులో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో ముగ్గురితో పాటు ఓ చిన్నారికి గాయాలయ్యాయి. మలుపు తిరుగుతున్న కారులో ఒక మహిళ గాయపడింది. వీరిని షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నాగేంద్రప్రసాద్‌కు రైతు నేస్తం పురస్కారం



కేవీకే శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్‌కు పురస్కారం అందిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాంబిల్లి: హరిపురం బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ ఐవీ సుబ్బారావు రైతు నేస్తం 2023 పురస్కారం దక్కింది. కృష్ణా జిల్లా గన్నవరంలో స్వర్ణభారతి ట్రస్ట్‌లో శనివారం ఈ పురస్కారాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు తనకు అందించినట్లు నాగేంద్రప్రసాద్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, అపరాలు, వరి, ఉద్యాన పంటలపై రైతులకు అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో హార్డ్‌వేర్ దుకాణం దగ్ధం



దుకాణంలో చెలరేగుతున్న మంటలు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు వాణిజ్య కేంద్రంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి ఓ హార్డ్‌వేరు దుకాణం దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు... దొండపాటి రాజేష్‌కు చెందిన హార్డ్ వేరు దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పెయింట్ డబ్బాలకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో ప్లేవుడ్ షీట్లు, ప్లాస్టిక్ వైర్లు ఇతర సామాన్లు కాలిపోయాయి. రూ. 10 లక్షలపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితుడు రాజేష్ లబోదిబోమంటున్నాడు. సమాచారం తెలుసుకున్న నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ప్రసాదరావు సహాయక చర్యలు చేపట్టారు. ఆస్తి నష్టం పూర్తి వివరాలు రెవెన్యూ అధికారులు వెల్లడిస్తారని ఎస్ఐ తెలిపారు.

## క్లుప్తంగా

### 'జగనన్న ఆరోగ్య సురక్ష' నేడు

**అనకాపల్లిటౌన్:** స్థానిక పట్టణ పరిధిలోని గొల్లవీధి యూపీహెచ్‌సీ, మండలంలో సీహెచ్ఎస్ అగ్రహారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ, ఎంపీడీవో కె.నరసింహారావులు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గతంలో రక్త పరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితో పాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఒక్కొక్క వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. కంటి చూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామస్తులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

**కశింకోట:** మండలంలోని తేగాడ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జరగనుందని ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ప్రత్యేక నిపుణులైన వైద్యులతోపాటు స్థానిక వైద్యులు హాజరై రోగుల్ని పరీక్షించి, ఉచితంగా మందులు, కంటి పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తేగాడతోపాటు సచివాలయ పరిధిలో ఉన్న పేరంటాలపాలెం, జోగారావుపేట గ్రామాలకు చెందిన ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

### ఎన్ఎంఎంఎస్ పరీక్షకు శిక్షణ



శిబిరంలో మాట్లాడుతున్న స్పందించే హృదయం ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

**కశింకోట:** కశింకోటలో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. స్థానిక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో జరిగిన శిబిరంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు మాట్లాడుతూ దసరా సెలవుల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం, మనో సామర్థ్యం పెంపుదలపై శిక్షణ ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆదారి సంజీవరావు మాట్లాడుతూ మనో సామర్థ్యంపై ఇచ్చే శిక్షణ విద్యార్థులకు విద్యా సంబంధిత అంశాల్లో కూడా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డి.నూకేష్, ఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఖోఖో, వాలీబాల్ పోటీలు



ఖోఖో, వాలీబాల్ క్రీడాకారులతో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

**తుమ్మపాల:** వాకర్స్ క్లబ్ ఫౌండర్ సుంకరి అక్బార్‌దాస్ జయంతి సందర్భంగా పట్టణంలోని గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్‌లో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు క్లబ్ అధ్యక్షుడు శివ, విశ్రాంత హెచ్ఎం డీఎస్ఎస్ మాణిక్యాలరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్రీడాధికారి, ఎన్‌సీసీ మాస్టర్ కె.జనార్దన్, ఉపాధ్యాయులు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 54 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-20 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్ :** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 298 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 105 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.




నూకాంబిక అమ్మవారి కలశాన్ని తీసుకువస్తున్న ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ దంపతులు


నూకాంబిక బాలాలయంలో హోమం చేస్తున్న దేవాలయం చైర్మన్, ధర్మకర్తల దంపతులు


అన్నసమారాధనలో చైర్మన్ మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్


సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో భవానీ మాలధారులు

# స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవీ నమోస్తుతే

- వైభవంగా మొదలైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఊరూవాడా అమ్మవారి ఆలయాల్లో భక్తుల కిటకిట

**దుష్టుడైన మహిషాసురుడ్ని సంహరించేందుకు అమ్మవారు తొమ్మిది అవతారాలు ధరించారని పురాణ ప్రతీతి. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా దసరా పండగను వైభవంగా నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. దుర్గాదేవిని వివిధ రూపాలతో అలంకరించి షోడశోపచారాలతో పూజిస్తారు. తొలిరోజైన ఆదివారం నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో అమ్మవారిని స్వర్ణకవచధారిణిగా, గాయత్రీమాతగా, బాలాత్రిపుర సుందరిగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు.**


ఆలయానికి పోటెత్తిన భవానీ భక్తులు

**అనకాపల్లిటౌన్:** పట్టణ, మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. ఊరూవాడా దుర్గాదేవి నామస్మరణతో మారుమోగిపోయింది. ఎక్కడచూసినా భవానీ మాలధారులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. నవరాత్రుల్లో భాగంగా తొలిరోజైన ఆదివారం తొలివేకువ నుంచే దుర్గమ్మ ఆలయాలు, స్థానిక గ్రామ దేవత గుడులు భక్తులతో పోటెత్తాయి.

**నూకాంబిక బాలాలయంలో విశేష పూజలు**

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో ఆదివారం శరన్నవరాత్రి వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవాన్ని దేవాలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ బాలకనకదుర్గ దంపతులు ప్రారంభించారు. బాలాలయంలో శ్రీ గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, రక్షాసూత్రధారణ, ఋత్విక్వరుణం, అఖండ దీప స్థాపన, నవదుర్గా పీఠస్థాపన, కలశస్థాపన, అగ్నిప్రతిష్ట, హోమాలు, భేరీపూజ, దిగ్బలి, పతాక ప్రతిష్ట, నీరాజన మంత్ర పుష్పములు, కుంకుమ పూజలు చేపట్టారు. దసరా నవరాత్రుల సందర్భంగా దాడి ఆదిశివ నూకరాజు లక్ష్మీపార్వతి, ప్రవీణశ్రేష్ట, కడిమిశెట్టి గణేష్ నైనా దంపతుల సహకారంతో అన్నసమారాధనను ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

**స్వర్ణకవచ ధారిణిగా సతకంపట్టు కనకదుర్గమ్మ**

స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారు స్వర్ణకవచ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద హోమాలు, కుంకుమ పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతుల ఆర్థిక సహాయంతో భవానీ మాలాధారులకు తొమ్మిదిరోజులపాటు జరిపే అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి రథయాత్రను పర్యవేక్షకులు పోలిమేర శ్రీనివాసరావు నిర్వహించారు. అమ్మవారి రథాన్ని శరన్నవరాత్రి తొమ్మిది రోజులు పురవీధుల గుండా ఊరేగిస్తారు.

**గాయత్రీదేవిగా గౌరీపంచాయతన అమ్మవారు**

గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి ఆదివారం భక్తులకు గాయత్రిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమాపూజలు చేశారు. ఆలయ బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ పూర్వక రథోత్సవాన్ని కమిటీ సభ్యులు ప్రారంభించారు. గౌరీపరమేశ్వరి అమృత వర్షిణి బృందం వ్యవస్థాపకులు పెతకంశెట్టి సుజాత ఆధ్వర్యంలో కోలాటాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా కామాక్షిదేవి రథోత్సవం**

గవరపాలెం నిదానందొడ్డి కామాక్షమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధులగుండా ఊరేగించారు. రథోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ప్రారంభించారు. మధ్యాహ్నం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేల్పులవీధిలో అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో పట్టణ గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు దంపతులు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**కన్యకాపరమేశ్వరి దేవాలయంలో..**

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం దుర్గమ్మ భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి బేడా సేవదార్ల గోత్ర నామములతో అర్చన, శ్రీచక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించారు. సాయంత్రం అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని వారిచే అమ్మవారికి భక్తి సంకీర్తనలు ఆలపించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, భక్తులు పాల్గొన్నారు.

➡ వేల్పులవీధి చాకలిపేట కనకదుర్గ అమ్మవారు ఆదివారం భక్తులకు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. తెల్లవారు జామునుంచి మహిళా భక్తులు పాల్గొన్ని అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, శారదానది ఒడ్డున ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయం, గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయం, గాంధీ కూరగాయల మార్కెట్ వద్దనున్న సాధువులగుడి, పురవీధుల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని దుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

➡ స్థానిక న్యూ కాలనీలోని అష్టాదశ శక్తిపీఠంలో ఆలయ అర్చకులు శివకోటి విశ్వేశ్వరశర్మ ఆధ్వర్యంలో సుమారుగా 300 మంది భవానీ భక్తుల మాలధారణ జరిగింది. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తాడి రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

➡ చాకలిపేటలో కనకదుర్గ అమ్మవారిని కమిటీ అధ్యక్షుడు ఎ.హనుమంతరావు ఆధ్వర్యంలో ఊరేగించి, నిలుపు మహోత్సవాన్ని చేపట్టారు.

➡ వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు భక్తులకు స్వర్ణకవచ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. రాఘవేంద్రస్వామి బృందావన సమితి సభ్యులచే వేదపారాయణం, భక్తిపాటల కార్యక్రమం నిర్వహించారు.

**కశింకోట:** కశింకోట వద్ద జాతీయ రహదారి పక్కనున్న కనకదుర్గమ్మ ఆలయం ఆదివారం భవానీ భక్తులతో కళకళలాడింది. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం పురస్కరించుకుని నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలు వేకువ జాము నుంచే అమ్మవారి ఆలయానికి చేరుకుని బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మొదటి రోజు బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు నడిగట్ల ప్రసాద్‌బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


కశింకోట వద్ద బాలాత్రిపుర సుందరీదేవిగా కనకదుర్గమ్మ

**కశింకోట:** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దుర్గాదేవి విగ్రహాలను నెలకొల్పి భవానీ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కశింకోటలోని గవరపేట మధ్య వీధి, రామాలయం, కస్పావీధి, పెద్ద బజారు, అమరపల్లి వీధి, పూసర్ల వీధి, హౌసింగ్ కాలనీ, గోవిందరావు కాలనీ, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, చలువ పందిళ్లలో నెలకొల్పారు. బయ్యవరం, తాళ్లపాలెం, బంగారయ్యపేట, నరసింగబిల్లి, చింతలపాలెం, వెదురుపర్తి, విసన్నపేట, రామన్నపాలెం, నూతలగుంటపాలెం, సోమవరం, ఏఎస్ పేట, అచ్చెర్ల, జి.భీమవరం, కన్నూరుపాలెం, గొబ్బూరు, తీడ, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, తదితర గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను నెలకొల్పి శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆయా ప్రాంతాలు మారుమ్రోగాయి.

**తుమ్మపాల:** శ్రీ దేవి నవరాత్రులను పురస్కరించుకుని శ్రీ చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం శ్రీ కనకదుర్గమ్మను నెలకొల్పి ప్రత్యేక పూజలతో, పాటు మహిళలు కుంకుమ పూజ, అభిషేకాలు చేశారు. ఈ తొమ్మిది రోజులూ ఆలయంలో అమ్మవారికి పూజలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.


కామాక్షిదేవి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్


గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి సన్నిధిలో కమిటీ సభ్యులు


బంగారయ్యపేటలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహం


ఉగ్గినపాలెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహానికి భవానీ భక్తుల పూజలు


ఉగ్గినపాలెం: దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భవానీ మాలధారణ భక్తులు


చాకలిపేట కనకదుర్గమ్మ నిలుపుమహోత్సవాన్ని పురస్కరించుకుని ఊరేగింపు


న్యూకాలనీ అష్టాదశ శక్తిపీఠంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయంలో వేదపారాయణం


చింతామణి దత్తక్షేత్రంలో కనకదుర్గమ్మ పూజలు


గాయత్రీదేవిగా గౌరీ పంచాయతన కనకదుర్గమ్మ

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు


అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్,

**తుమ్మపాల:** మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతి వేడుకలు పట్టణంలోని అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ మాట్లాడుతూ కలాం దేశ రక్షణ రంగానికి అందించిన సేవల్ని కొనియాడారు. కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్, అధ్యక్షురాలు జి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జార్జి క్లబ్ వద్ద వేడుకల్లో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, జగన్నాథస్వామి ట్రస్ట్ చైర్మన్ దాడి ఈశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, పార్టీ నాయకులు బొడ్డపాటి రాజారావు, పొట్ట చిన్నియాదవ్, బండి అప్పారావు పాల్గొన్నారు.

➡ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏఎంఏఎల్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డీడీ నాయుడు, ప్రెసిడెంట్ యల్లపు సాంబశివరావు కలాం విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## వేంకటేశుని సన్నిధిలో గీతా ప్రవచనాలు


గీతాశ్లోకాలను ప్రవచిస్తున్న లింగరామేశ్వరరావు

**కశింకోట:** స్థానిక గవరపేటలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొణతాల లింగరామేశ్వరరావు భగవద్గీత ప్రవచనాలు ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో గీతా ప్రవచన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. రోజూ సాయంత్రం పూట నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, విని తరిస్తున్నారు.

## సమష్టి బాధ్యతతోనే పర్యావరణ పరిరక్షణ

**అనకాపల్లిటౌన్:** వాతావరణంలో మార్పులు కారణంగా ఉష్ణోగ్రత పెరిగి సీజన్‌లు తారుమారు అవుతున్నాయని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య అన్నారు. గవరపాలెం జగన్నాథస్వామి దేవాలయం ఆవరణలో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలునాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో గృహాలు నిర్మించుకునే వారు పర్యావరణంపై దృష్టి సారించాలని సూచించారు. జగన్నాథస్వామి దేవస్థానం మాజీచైర్మన్ దాడి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి మన ఆరోగ్యంపై, జీవనశైలి, తదితర అంశాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతికి మనిషి చేసే హాని చాలా ఎక్కువని, తల్లితో సమానమైన ప్రకృతిని కాపాడుకోవాలని కోరారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి లక్ష్మీసౌజన్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 81వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, అటవీశాఖ విశ్రాంత రేంజ్ అధికారి బీరా వినోద్‌కుమార్, సభ్యులు కాండ్రేగుల వెంకట సాంబశివరావు, సంతోష్‌కుమార్, మాణిక్యం, ఆనంద్, సత్తిబాబు అనిత, రంజిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య

## లాస్విక ఆర్యకు అభినందన సత్కారం

**తుమ్మపాల :** పుట్టిన ఏడాదిలోనే అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు సాధించిన మంత్రి లాస్విక ఆర్యను శ్రీ చింతామణి గణపతి దత్త క్షేత్ర సభ్యులు ఎం.ఆంజనేయరాజు, సీనియర్ ట్రస్టీ మూర్తి ఆలయంలో ఆదివారం సత్కరించారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లిలోని ఆలయంలో శ్రీచింతామణి గణపతి వద్ద లాస్విక పొందిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియన్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డ్, చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థల ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ వస్త్రంతో పాటు చిత్రపటాన్ని, జ్ఞాపికను అందించి తల్లిదండ్రులను సత్కరించారు. లాస్విక ఆర్య మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ట్రస్టీ సభ్యులు సీపీ రామారావు, ఇంద్రలక్ష్మి, ఎం.రుషికేష్, సీహెచ్ సోమయాజులు, ఎ.పద్మావతి, రవిచంద్ర పాల్గొన్నారు.


చిన్నారిని సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న దత్త క్షేత్ర ప్రతినిధులు

## మన చేతుల్లోనే.. మన ఆరోగ్యం


చేతుల శుభ్రతపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న స్వయం సహాయక బృందాలు

**కశింకోట:** మండలంలోని పలు గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవానికి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోటలోని దర్గా వీధి, తేగాడ, అచ్చెర్ల, నరసింగబిల్లి తదితర గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొని, చేతులు శుభ్రంగా ఉంచుకోవలసిన ఆవశ్యకతను వివరించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, సంపూర్ణ ఆరోగ్యం కోసం చేతుల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో తేగాడ ఎంపీటీసీ సభ్యురాలు తుంపాల మంగ తాయారు, వెలుగు వీవోఏ మంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.